


# కరపత్రం

SINCE 2014

సోమవారం మే 18, 2026 | సంపుటి : 2 | సంచిక : 216 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# రైతు సంక్షేమంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

## రుణమాఫీ, సాగునీటి విడుదల, ధాన్యం కొనుగోళ్లపై కీలక ఆదేశాలు

- రైతు రుణమాఫీ అమలుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- సాగునీటి విడుదలపై అధికారులకు కీలక ఆదేశాలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- తేమ శాతం పేరుతో రైతులను వేధించొద్దని స్పష్టం
- గన్నీ బ్యాగులు, లారీలను ముందుగానే సిద్ధం చేయాలని సూచన
- రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలు
- వ్యవసాయ శాఖ, సాగునీటి శాఖ అధికారులతో సీఎం సమావేశం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ, సాగునీటి శాఖ, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు రుణమాఫీ అమలు పురోగతి, సాగునీటి విడుదల పరిస్థితి, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. రుణమాఫీకి అర్హులైన ప్రతి రైతుకు పారదర్శకంగా లబ్ధి చేకూరేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు లేదా బ్యాంకింగ్ ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు**

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టరాదని, అవసరమైన గన్నీ బ్యాగులు, లారీలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు.

**సాగునీటి విడుదలపై ఆదేశాలు**

ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు తగిన నీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని సాగునీటి శాఖ అధికారులకు సీఎం సూచించారు. ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

**రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి**

రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమావేశంలో మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కరీంనగర్ సింహగర్జన సభ @25.. కేటీఆర్ ప్రత్యేక పోస్ట్



**హైదరాబాద్:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక సభ అయిన కరీంనగర్ సింహగర్జన సభకు 25 ఏళ్లు నిండాయి. ఈ మేరకు అప్పటి పేపర్ క్లిప్పింగ్‌లను ట్యాగ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 2001 మే 17న జరిగిన సింహగర్జన నుంచి ఇటీవలే పూర్తయిన రజతోత్సవ వేడుకల వరకు బీఆర్ఎస్ పార్టీ అదే జోష్‌లో ఉందని అన్నారు. కనుచూపు మేరల్లో అంతా అంధకారం, అన్నీ అపనమ్మకాలు, గత కాలపు గాయాలు.. ధనం బలం లేదు.. రాజకీయ బలగం లేదు. అయినా సింహగర్జన సభకి జనం పోటెత్తిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తనను కన్నభూమి తెలంగాణ.. ఎందుకిలా గోస పడుతుందన్న ఆవేదన, మాతృభూమిపై గుండెల నిండా పొంగే తెలంగాణ ప్రేమ, రాష్ట్రాన్ని సాధించాలన్న నిండైన పట్టుదల, ప్రజలు అండగా ఉంటారన్న భరోసా.. ఈ నాలుగే ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను నడిపించిన నాలుగు రథ చక్రాలని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.



## యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

**దామరచర్ల:** నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పవర్ ప్లాంట్‌లోని యూనిట్-3లో భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. పరిసర ప్రాంతాల్లో దట్టంగా పొగ అలముకుంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు సమాచారం.

2 లో

## భానుడి భగ భగ.. వారం రోజులు జాగ్రత్త..!

- వారం రోజులపాటు తీవ్ర ఎండల హెచ్చరిక
- 45 డిగ్రీలు దాటే ఉష్ణోగ్రతల అవకాశం
- పలుచోట్ల వడగాలులు వీచే ప్రమాదం
- ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 వరకు బయటకు వెళ్లొద్దని సూచన
- తెలంగాణలో పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్
- నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలి
- పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి
- వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలి

2 లో



**హైదరాబాద్:** వచ్చే వారం రోజులపాటు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు ఠారెత్తించనున్నాయి. ఈ నెల 19-24వ తేదీ మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. సగటు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటే ప్రమాదం ఉందని, వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఇవాళ తెలంగాణలో ఆదిలాబాద్, కుమురం భీం, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి : కేటీఆర్

- భగీరథ్ కేసులో నిష్పాక్షిక విచారణ కోరిన కేటీఆర్
- బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్
- భగీరథ్‌ను 9 రోజులు దాచారని ఆరోపణ
- బాధిత కుటుంబాన్ని బెదిరించారని విమర్శ
- కేసును నీరుగార్చే ప్రయత్నమన్న కేటీఆర్




**హైదరాబాద్:** బండి భగీరథ్ పోక్సో కేసుపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. బండి భగీరథ్ కేసులో నిష్పాక్షిక విచారణ చేయాలి. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి. లేదంటే విచారణ పారదర్శకంగా జరిగే పరిస్థితి లేదు. తప్పు చేసిన కొడుకును తొమ్మిది రోజులు దాచిపెట్టారు. బేటీ బచావో అన్నది నినాదాలకు సరిపెడతారా మోదీ గారూ. కేంద్ర మంత్రి కొడుకుపై లుక్‌ఔట్ నోటీసు ఇవ్వడం తొలిసారి. బాధిత కుటుంబాన్ని బెదిరించి, ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారు'అని వ్యాఖ్యానించారు.

## బండి భగీరథ్‌తో పార్టీకి సంబంధం లేదు:కిషన్ రెడ్డి

- భగీరథ్‌తో పార్టీకి సంబంధం లేదన్న కిషన్‌రెడ్డి
- పోలీసుల ఎదుట భగీరథ్ లొంగిపోయినట్లు వెల్లడి
- కేంద్రానికి సంబంధం లేదని స్పష్టం
- భగీరథ్‌కు 14 రోజుల రిమాండ్
- చర్లపల్లి జైలుకు తరలింపు
- నా కుమారుడు తప్పు చేయలేదన్న బండి సంజయ్

**హైదరాబాద్:** బండి భగీరథ్ అంశమై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బండి భగీరథ్ ఇదివరకే సరెండర్ అయ్యారని ఆ విషయంతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర పోలీసులు అంశంలో కేంద్రానికి ఎటువంటి సంబంధం ఉండదని తెలిపారు. ఈ కేసులో పోలీసుల విచారణ కొనసాగుతుందని తెలిపారు.



2లో..

పెట్రోల్ పై ట్యాక్స్ తగ్గించాలని కేంద్ర కోరినా రాష్ట్రం ఏమాత్రం తగ్గించడం లేదన్నారు.



## ఎంపీ అరవింద్ Vs ఎమ్మెల్యే సంజయ్ కుమార్.. సోషల్ మీడియాలో మాటల యుద్ధం

బీజేపీ ఎంపీ అరవింద్ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు తీవ్రవిమర్శలు చేసుకున్నారు. జగిత్యాల మంజూరైన కేంద్రీయ విశ్వ విద్యాలయాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఎంపి ధర్మపురి అరవింద్ అరోపించారు. నిరసనగా రేపు సోమవారం మే 18,2026న ధర్మదీక్షకు పిలుపునిచ్చారు.

## హైకోర్టు న్యాయమూర్తిపై అసత్య ప్రచారం.. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు

**హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై సామాజిక మాధ్యమాల్లో కల్పిత వార్తలు ప్రచారం చేసిన ఘటనపై చార్మినార్ పోలీసులు కేసు నమోదు చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) బి.ఎస్. చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు సమాచారం.




మిగతాది 2లో

## సంగారెడ్డి జిల్లాలో విషాదం.. చెరువులో మునిగి ముగ్గురు బాలురు మృతి

**రాయికోడ్:** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం రామోజీపల్లిలో విషాదం చోటు చేసుకుంది. ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో మునిగి నిరంజన్ (13), బసవరాజు (10), మణి (12) మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు స్థానికుల సాయంతో చెరువులోంచి మూడు మృతదేహాలను వెలికితీశారు. ఘటనపై రాయికోడ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## బండి భగీరథ్‌తో పార్టీకి సంబంధం లేదు:కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి
అయితే కేంద్రమంత్రి బండిసంజయ్ కుమారుడు బండి భగీరథ్ నిన్న (శనివారం) పోలీసుల ఎదుట లొంగిపోయారు. అనంతరం మేడ్చల్ మేజిస్ట్రేట్ ఎదుట ఆయనను హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో భగీరథ్ ను చర్లపల్లి జైలుకు తరలించారు.
కాగా ఈ విషయంపై స్పందించిన బండి సంజయ్.. తన కుమారుడు ఎటువంటి తప్పు చేయలేదని చెబుతున్నాడని అందుకే పోలీసుల ఎదుట లొంగిపోయారన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాల్సిందేనని తెలిపారు

## భానుడి భగ భగ..
## వారం రోజులు జాగ్రత్త..!

మొదటి పేజీ తరువాయి
ఎండల తీవ్రత దృష్ట్యా ఇవాళ 16 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఆయా జిల్లాల్లో 41-44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సోమవారం ఏడు జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

### బయటకు వెళ్తున్నారా? వైద్యుల సూచనలివే!

టోపీ లేదా టవల్ తలకు కట్టుకోవాలి. ముక్కు, చెవుల ద్వారా వేడి గాలి లోపలికి వెళ్లకుండా కర్చీఫ్ కట్టుకోవాలి. నూలు దుస్తులు ధరించాలి.
గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాల రోగాలతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ వేడికి చెమటతో ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా పోతుంటాయి. దీనివల్ల అలసటతోపాటు అస్వస్థత కలుగుతుంది. వీలైనంత ఎక్కువ నీరు తాగాలి. కొబ్బరి నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. నిమ్మరసం ఉప్పు, చక్కెర కలిపి తాగొచ్చు.
రేకుల ఇళ్లలో నివాసం ఉండేవారు, ఇళ్లలోకి నేరుగా ఎండ వచ్చేవారు, వేడి గాలులు నేరుగా వచ్చే ఇళ్లలో ఉండే వారు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రేకులపై గడ్డి, జనపనార సంచులు వేసి వేడి తగ్గించుకోవాలి.
వడదెబ్బతో అస్వస్థతకు గురైతే వారిని వెంటనే చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లి తల నుంచి కాళ్ల వరకు తడి గుడ్డతో పూర్తిగా తుడవాలి. గాలి ఆడే విధంగా చూడాలి. కొంత తేరుకున్నాక ఓఆర్ఎస్ ద్రావణం తాగించి ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
ఎవరైనా వాంతులు, విరేచనాలతో బాధపడితే వారిని వెంటనే ఆసుపత్రికి తరలించాలి. కొన్ని రక్తపోటు మందులతో మూత్ర విసర్జన ఎక్కువగా ఉంటుంది. మూత్రం ద్వారా కూడా సోడియం, పొటాషియం తదితర లవణాలు వెళ్తూ ఉంటాయి. వీరు నీరు ఎక్కువగా తీసుకోవాలి.

## హైకోర్టు న్యాయమూర్తిపై అసత్య ప్రచారం..
## పలు సెక్షన్ల కింద కేసులు నమోదు

మొదటి పేజీ తరువాయి
ఫోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో కల్పిత వార్తలు ప్రచారం జరిగాయి. ఈ వార్తలు న్యాయమూర్తులపై ప్రభావం చూపే ప్రయత్నంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కల్పిత వార్తలు ప్రచారం కావడంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజల మధ్య విస్తృత చర్చకు దారి తీసింది. ఇది న్యాయవ్యవస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రమాదం ఉందని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు.
చార్మినార్ పోలీసులు ఐటీ యాక్ట్‌తో పాటు భారత న్యాయసంహిత (BNS)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్ 353(1)(c), బీఎన్ఎస్ 353(2), బీఎన్ఎస్ 267 సెక్షన్ల కింద ఎస్ఐఆర్ (SIR) నమోదు చేసి, కేసును దర్యాప్తు నిమిత్తం హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు.

## ఎంపీ అరవింద్ Vs ఎమ్మెల్యే సంజయ్ కుమార్..
## సోషల్ మీడియాలో మాటల యుద్ధం

మొదటి పేజీ తరువాయి
ఈ దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై (శనివారం) ఆందోళనకు దిగారు బీజేపీ నేతలు.అయితే దీనిపై సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తీవ్రవిమర్శలు చేశారు. అరవింద్ ఆరోపణలకు స్పందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్..కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాలు కేటాయిస్తామని ప్రకటించారు. కేంద్రీయ విద్యాలయానికి 10 ఎకరాలు అడిగితే సోషల్ మీడియా వేదికగా రెండెకరాలు ఇవ్వడమేమిటి అని నిలదీస్తూ మరో వీడియో విడుదల చేశారు ధర్మపురి అరవింద్.ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటూ పరస్పరం సోషల్ మీడియాలో పోస్ట్ లు షేర్ చేయడంతో కేంద్రీయ విశ్వ విద్యాలయం అంశం బాగా వైరల్ అవుతోంది.

## బుల్లెట్ బండి ఎక్కిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో పర్యటించారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్‌కోట్‌ను ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయన వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ఉన్నారు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టివేత
## రూ.5.5 కోట్ల విలువైన పసిడి స్వాధీనం

దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి అక్రమ బంగారం గుట్టురట్టయింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ బంగారం స్మగ్లింగ్ యత్నాలను భగ్నం చేశారు కస్టమ్స్ అధికారులు. పక్కా సమాచారంతో నిఘాపెట్టిన కస్టమ్స్ విభాగం అధికారులు.. అమెరికా నుంచి వచ్చిన ఓ భారత సంతతి వ్యక్తి వద్ద నుంచి రూ.5.5 కోట్ల విలువైన పసిడిని స్వాధీనం చేసుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి వచ్చిన సదరు ప్రయాణికుడు ఎవరికీ అనుమానం రాకుండా విమానాశ్రయం నుంచి బయటపడేందుకు యత్నించాడు. అయితే.. అంతర్జాతీయ స్మగ్లర్లు భారీగా బంగారాన్ని భారత్‌కు తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో అధికారులు అప్పటికే అలర్ట్ అయ్యారు. సదరు ప్రయాణికుడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో కస్టమ్స్ బృందం అతడిని అడ్డుకుని విచారించింది. అతడిని, లగేజీని తనిఖీ చేయగా.. అసలు విషయం వెలుగుచూసింది. అతను ధరించిన ప్రత్యేక బెల్టుతో పాటు ప్యాంటు జేబుల్లో అత్యంత చాకచక్యంగా దాచిన 115 బంగారు బిస్కెట్లను(24 క్యారెట్లు) అధికారులు గుర్తించారు. ఇవి మొత్తం సుమారు 3.5 కిలోల బరువు ఉంటాయని, వీటి మార్కెట్ విలువ దాదాపు రూ.5.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అధికారులు.. ప్రస్తుతం అతని కాల్ డేటా, ప్రయాణ వివరాలు, ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తి రవాణాదారు మాత్రమేనని.. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ సిండికేట్ హస్తమున్నట్టు అనుమానిస్తున్నారు. ఇటీవల బంగారంపై దిగుమతి సుంకం పెరగడంతో స్మగ్లింగ్ కేసులు ఎక్కువయ్యాయని.. అందుకే ఎయిర్‌పోర్టుల్లో అత్యాధునిక స్క్రీనింగ్ టెక్నాలజీ, రిస్క్ ప్రొఫైలింగ్ ద్వారా నిఘాను మరింత తీవ్రం చేసినట్లు వెల్లడించారు కస్టమ్స్ అధికారులు.

## విమానయాన సంస్థలకు భారీ ఊరట
## ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ తగ్గింపు

విమానయాన సంస్థలకు భారీ ఊరట కలిగిస్తూ ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ ను భారీగా తగ్గించింది. ఏటీఎఫ్‌పై ప్రస్తుతం ఉన్న వ్యాట్‌ను 25 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. విమానాలు నడిపేందుకు జెట్ ఇంజన్లలో ఏటీఎఫ్ వినియోగిస్తున్నారు. వ్యాట్ తగ్గింపునకు ఢిల్లీ సర్కార్ తాజా నిర్ణయంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాయాశ్రంలో ఇంధనం కొనుగోలు చేసే విమానయాన సంస్థలు తక్కువ ధరలను చెల్లించే వీలుంటుంది. 'ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 25 శాతం నంచి 7 శాతానికి తగ్గించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఎయిర్‌లైన్స్‌కు, సాధారణ ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుంది' అని ఒక అధికార ప్రకటన విడుదల చేశారు. దీనికి ఒకరోజు ముందు మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ఏటీఎఫ్‌పై వ్యాట్‌ను 18 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మే 15వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, గ్లోబల్ క్రూడాయిల్ ధరల పెరుగుదల, సరఫరాలో అవాంతరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భారతీయ విమానాయాన సంస్థల మొత్తం నిర్వహణ
ఖర్చుల్లో సుమారు 35 నుంచి 45 శాతం జెట్ ఇంధనానికే ఖర్చవుతుంది. ఏటీఎఫ్‌పై వ్యాట్ తగ్గింపు నిర్ణయంతో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి ప్రముఖ విమానయాన సంస్థలకు ఒకింత ఊరట కలుగనుంది.

## పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై భారం
## హైదరాబాద్‌లో సిపిఎం నిరసన ప్రదర్శన

పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగా ప్రభావం పడుతుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేలా కృషిచేయాలని డిమాండ్ చేశారు. మోదీ చెబుతున్న పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థితిలో ఉందని చెప్పారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని ఆరోపించారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌నకు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్, సీనియర్ నేత డీజీ.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొయినాబాద్ జంట హత్యల కేసు..
## నిందితురాలు ఆత్మహత్యాయత్నం




హైదరాబాద్: మొయినాబాద్ జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగం ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం రేపింది. ఆబేదాబేగం, మహబూబాబీ.. తాండూరు పట్టణం ఇందిరమ్మ కాలనీలో ఉండే దంపతులు కరీమాబేగం, రెహమాన్, వీరి బంధువు నయీంకు వేర్వేరుగా కొంత డబ్బు అప్పుగా ఇచ్చారు. చాలారోజులు అవడంతో డబ్బులు తిరిగివ్వాలని వారిపై మహిళలిద్దరూ ఒత్తిడి తెచ్చారు. దీంతో వారిని చంపేయాలని కరీమాబేగం, రెహమాన్, నయీం పథకం వేశారు. డబ్బు ఇస్తామని నమ్మించి ముందుగా మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫాంహౌస్ వద్దకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసి, అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. ఆ తరువాత ఆబేదాబేగంను కూడా అక్కడికే తీసుకెళ్లి అదేరీతిలో హత్య చేసి పాతిపెట్టారు. ఈ కేసులో కరీమాబేగంను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం కరణ్‌కోట్ పీఎస్‌లో విచారిస్తుండగా.. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించారు. హుటాహుటిన ఆమెను చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

## కాంగ్రెస్ ఆఫీసులో దొంగతనం చేసి..
## 'లవ్‌యూ' అని నోట్ రాసి..!



ఛత్తీస్‌గఢ్ లోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన డజన్ల కొద్దీ స్టీల్ ట్యాప్‌లు చోరీకి గురయ్యాయి. అయితే, దొంగతనానికి పాల్పడిన వారు నోట్ రాసిమరీ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. సుర్గుజా జిల్లాలోని అంబికాపుర్‌లో ఉన్న కాంగ్రెస్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. దొంగలు దాదాపు 73 ట్యాప్‌లు ఎత్తుకెళ్లారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇదే క్రమంలో చోరీ చేసిన వారు నేలపై ఉన్న దుమ్ము మీద 'లవ్ యూ' అని రాసి వెళ్లినట్లు వెల్లడించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలకృష్ణ పాఠక్ అనుమానం వ్యక్తం చేశారు. ఈ కార్యాలయంలో దొంగతనం జరగడం ఇది మూడోసారని తెలిపారు. దొంగలు నోట్ రాసిమరీ వెళ్లారంటే.. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని స్పష్టమవుతోందన్నారు. ఈ సందర్భంగా పోలీసుల పనితీరును ఆయన పశ్నించారు. పార్టీ నేతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అంబికాపుర్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

## వెండి దిగుమతులపై ఆంక్షలు
## ఆదేశాలు జారీ చేసిన కేంద్రం

పశ్చిమాసియాలో సంక్షోభం వేళ ఇటీవల బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని పెంచిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా మరిన్ని చర్యలు తీసుకుంది. వెండి దిగుమతులపై ఆంక్షలు విధించింది. స్వేచ్ఛా విధానం నుంచి పరిమిత విధానానికి సవరించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని విదేశీ వాణిజ్య విభాగ డైరెక్టరేట్ జనరల్ ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఆంక్షల విభాగంలో ఉండే వస్తువులను దిగుమతి చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. విదేశీ మారకపు ద్రవ్యాన్ని జాగ్రత్తగా వాడుకునేందుకు వీలుగా బంగారం కొనడాన్ని ఏడాదిపాటు ఆపేయాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారం, వెండి దిగుమతులను నియంత్రిం చేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఈ రెండు లోహాల దిగుమతులపై సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. తాజాగా వెండి దిగుమతిపై ఆంక్షలు విధించడం గమనార్హం.

## మైనర్ బాలిక వాంజ్ఞ్మూలం నమోదు

మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలను 40 నిమిషాల పాటు రికార్డు చేశారు. ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాలను రెండుసార్లు పోలీసులు నమోదు చేశారు. మరోవైపు, భగీరథ్ దేశం దాటిపోకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అతడి కోసం 5 బృందాలు గాలిస్తున్నాయి. భగీరథ్‌పై పోక్సో కేసు నమోదవ్వడంతో అతడితో టచ్‌లో ఉన్నవారిపై, స్నేహితులు, బంధువుల ఇళ్లపై పోలీసులు నిఘా ఉంచినట్లు సమాచారం. బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక బృందం తనిఖీలు చేపట్టింది.

## ఉప్పల్ వరంగల్ రూటులో ట్రాఫిక్ ఆంక్షలు
## - వరంగల్ బస్ స్టాప్ నల్లచెరువుకు తరలింపు

ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగు తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉప్పల్ సర్కిల్‌లోని వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. ఉప్పల్ వద్ద వరంగల్ వైపు వెళ్లే రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. జీఎస్ఐ జంక్షన్ వద్ద బీరప్పగడ్డ మీదుగా ఎన్‌హెచ్-163 మీదకు డైవర్ట్ చేయనున్నారు. అలాగే, వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులో వెళ్లి ఫ్లైఓల్గ÷వర్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి వచ్చే పెద్ద వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్‌కేసర్‌కు మళ్లించనున్నారు.

## నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే తెలంగాణలో మాత్రం ఎండల తీవ్ర తగ్గడం లేదు. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41-44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

## జవహర్ నగర్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు
## నేపాలీ దంపతులతో పాటు మరొకిరి అరెస్ట్

**నిందితుల నుంచి నగదు, బంగారం స్వాధీనం**
**వివరాలు వెల్లడించిన డిసిపి సుమతి**
సికింద్రాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి ఇంట్లో చోరీ చేసిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన చోరీలో నేపాలీ దంపతులు మమత, రమేశ్‌తోపాటు సబీనాను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నేపాలీ ముఠా సభ్యులు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. ఈ చోరీ కేసును 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడంతో లభించిన క్లూస్ ఆధారంగా 72 గంటల్లో ఈ కేసును ఛేదించినట్లు మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. పక్కా ఎ÷-లాన్‌తో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి తెగబడిన ఈ ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మీనా అలియాస్ మమత పుట్టిన రోజు వేడుకల కోసం మిగతా వారు వచ్చారని యజమానులను నమ్మించి.. వృద్ధ దంపతులను కట్టేసి ఈ ముఠా చోరీకి పాల్పడిందని వివరించారు. ఇకపై ఇంటి యజమానులు ఎవరైనా పనిలో పెట్టుకొనేవారి వివరాలను తాము రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేయాలని సుమతి సూచించారు. జవహర్‌నగర్‌లోని కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) నివాసం ఉంటున్నారు. నమ్మకంగా పనికి కుదిరిన నేపాలీ దంపతులు పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటామని చెప్పారు. యజమాని ఇంట్లో చోరీ చేసేందుకే నేపాలీ వాళ్లను మమత, రమేశ్ రప్పించారు. అర్ధరాత్రి దాటాక ఇంటి యజమానులు మురళీధర్, విజయలక్ష్మి దంపతులను కట్టేసి చోరీకి పాల్పడ్డారు. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండి, రూ. 30వేల నగదు, 3 వేల డాలర్లతో నేపాలీ ముఠా పరారైంది.

## గన్నవరం ఎయిర్‌పోర్టు
## మూసివేత అంటూ దుష్ప్రచారం

**- తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్న ప్రభుత్వం**
విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేస్తారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. గన్నవరం ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీని తట్టుకొనేందుకు రూ.611.80 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపింది. దీన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపింది. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రాజెక్ట్. రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు జిల్లా, తాడికొండ మండలం రావెల గ్రామ సమీపంలో సుమారు 4,618 ఎకరాల్లో కొత్త గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయితే, ఇది భవిష్యత్తులో అమరావతిని గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా, విమానాల మరమ్మతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక ప్రాజెక్టు. రెండు విమానాశ్రయాలూ కలిసే కొనసాగుతాయి. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందుతున్న రాజధాని ప్రాంతాల్లో ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలు ఉండటం సాధారణం. అదే విధంగా అమరావతిలో కొత్త ఎయిర్‌పోర్ట్ వచ్చినా, విజయవాడ గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ యథావిధిగా తన సేవలను కొనసాగిస్తుంది. ఈ అంశంలో తప్పుడు ప్రచారం నమ్మవద్దని కోరుతున్నాం అని పేర్కొంది.

# బాలికల రక్షణకు పోక్సో చట్టం ధర్మ సంకల్ప కవచం

- నీలాజ్యోతి(ఫ్యామిలీ మోటివేటర్/పొయట్ జర్నలిస్ట్/ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ/తెలంగాణ).



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 17**
సమాజంలో రోజు రోజుకు పెరుగుతున్న బాలలపై లైంగిక నేరాలు ప్రతి మనసును కలచివేస్తున్న వేళ,పిల్లల రక్షణ కోసం రూపొందిన "పోక్సో చట్టం" (POCSO Act) పై ఫ్యామిలీ మోటివేటర్,పొయట్ జర్నలిస్ట్,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి తన భావోద్వేగ స్పందనను తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

"పిల్లల కన్నీరు దేశ భవిష్యత్తుపై పడే నల్ల మచ్చ.ఆ మచ్చను తుడిచేందుకు పోక్సో చట్టం ఒక రక్షణ కవచం."అని పేర్కొన్నారు.2012వ సంవత్సరం నుంచి అమలులోకి వచ్చిన "ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ఫ్రమ్ సెక్సువల్ ఆఫన్సెస్ (పోక్సో) యాక్ట్ " బాలికలపై జరిగే,జరుగుతున్న లైంగిక దాడులు,వేధింపులు,ఆన్‌లైన్ దుర్వినియోగాలు వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిన చట్టమని ఫ్యామిలీ మోటివేటర్,పొయట్ జర్నలిస్ట్,ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి వివరించారు.18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి బాలబాలికలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని తెలిపారు.పోక్సో చట్టం కేవలం నేరస్తులకు శిక్ష విధించే చట్టం మాత్రమే కాదు పిల్లల మనసులను, భవిష్యత్తును కాపాడే సామాజిక బాధ్యత అని అన్నారు.చట్టం పుస్తకాలలో ఉండటం మాత్రమే సరిపోదు అని ప్రతి ఇంట్లోను అవగాహనగా కల్పించాలని అని అన్నారు.

**పోక్సో చట్టంలోని ముఖ్య అంశాలు:**
పిల్లలపై లైంగిక వేధింపులకు కఠిన శిక్షలు,బాలల గోప్యతకు ప్రత్యేక రక్షణ ప్రత్యేక న్యాయకోర్టుల ద్వారా వేగవంతమైన విచారణ

**పిల్లలకు భయరహిత వాతావరణంలో స్టేట్‌మెంట్ నమోదు**

ఆన్‌లైన్ లైంగిక వేధింపులపై కూడా చర్యలు కల్పించే వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లలకు "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" గురించి చిన్న వయసులోనే అవగాహన కల్పించడం అత్యంత అవసరం.తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలి.అంతేకాకుండా పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించాలని సూచించారు. చిన్న పాపలపై పాశవికత్వం చూపేవాడు మనిషి కాదు అని మానవత్వానికి మచ్చ అని తీవ్రంగా స్పందించారు. సమాజంలో మహిళల,బాలికల భద్రతపై అవగాహన మరింత పెరగాలని,ప్రతి ఒక్కరికి చట్టాలపై కనీస జ్ఞానం కలిగి ఉండాలని పొయట్ జర్నలిస్ట్, ఫ్యామిలీ మోటివేటర్ నీలాజ్యోతి పిలుపు నిచ్చారు.బాల్యం దేవుడిచ్చిన పవిత్ర భాగ్యం.బాల్యం ను కన్నీటి రాగంగా మార్చనివ్వకండి. ప్రతి చిన్నారిని సురక్షితంగా ఉండే సమాజమే నిజమైన నాగరిక భారతం.అలాగే ప్రతి చిన్నారి చిరునవ్వు కోసం ప్రతి ఒక్కరి మనసులో బాధ్యత వెలగాలని ఆమె అన్నారు.పిల్లలు,మహిళల భవిష్యత్తును రక్షించేందుకు కేంద్ర,రాష్ట్రాలు ప్రత్యేకంగా బ్రహ్మాస్త్రం ను రూపొందించాలని, చట్టాలను మరింత కఠినతరం చేసి పోలీస్ వ్యవస్థను మరింత బాధ్యతగా ప్రతిక్షణం, అనుక్షణం డేగ కన్నులతో పర్యవేక్షణ చేసేలా న్యాయస్థానంతో పాటు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని,బాలికలకు,మహిళలకు రక్షణ నిలయంగా బాధ్యతగా వ్యవహించేలా చూడాలని ఒక మాతృమూర్తిగా,ఒక మహిళగా,పొయెట్ జర్నలిస్ట్, ఫ్యామిలీ మోటివేటర్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ డివిజనల్ సెక్రటరీ నీలాజ్యోతి తమ మనోభావాలను తెలిపారు.

# ఏప్‌సెట్ ఫలితాల్లో 'మోషన్" కాలేజీ విద్యార్థుల సత్తా

- రాష్ట్ర స్థాయి ర్యాంకులతో హన్మకొండ మోషన్‌కు ప్రత్యేక గుర్తింపు

**కరపత్రం ప్రతినిధి మే 17**



హన్మకొండలోని రాజస్థాన్ కోటా 'మోషన్" కాలేజీ విద్యార్థులు ఆదివారం విడుదలైన ఏప్‌సెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల నాణ్యమైన బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఈ విజయాలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. కాలేజీకి చెందిన విద్యార్థులు సాధించిన ముఖ్యమైన ర్యాంకులు ఇవి:
బిట్ల హాసని -- రాష్ట్ర ర్యాంక్ 2384 (హాల్ టికెట్ నెం: 2626T01163), ఇమ్మడి శరణ్య -- రాష్ట్ర ర్యాంక్ 3476 (2621L05264), పలిక శ్రీ వర్థిత -- రాష్ట్ర ర్యాంక్ 4792 (2623T10020), అంచ ప్రవళిక -- రాష్ట్ర ర్యాంక్ 7673 (2621L01044) ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల విజయాల్లో కీలక పాత్ర పోషించిన అధ్యాపక బృందానికి, నిరంతరం ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ఉత్తమ విద్యా ప్రమాణాలు అందిస్తూ మరిన్ని విజయాలను సాధించే దిశగా మోషన్ కాలేజీ ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు.

# "హలో కార్మిక -- చలో కోటి"

- 25న హైదరాబాద్‌లోని డీఎంఈ కార్యాలయం వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలి
- కుర్రి సైదయ్య





**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 17**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న హైదరాబాద్ కోటి లోని డీఎంఈ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్పీఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య పిలుపునిచ్చారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్, మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రభుత్వ ఆసుపత్రుల్లో గత 20 నుంచి 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెడ్‌సైడ్ కార్మికులుగా సేవలు అందిస్తున్న తమపై కాంట్రాక్టర్ వ్యవస్థ దళారీ విధానంగా మారి కార్మికుల హక్కులను హరించు తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17,800 మంది కార్మికుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలులో కూడా అనేక అక్రమాలు జరుగుతున్నాయని, కార్మికుల జీతాల నుంచే డబ్బులు కోత విధించి డబుల్ ఈపీఎఫ్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2022లో జీవో నెంబర్ 60 ప్రకారం ప్రతి కార్మికుడికి రూ.15,600 వేతనం చెల్లించాల్సి ఉండగా, ఈపీఎఫ్, ఈఎస్ఐ కోతల తర్వాత కనీసం రూ.12,093 అందాల్సి ఉందన్నారు. అయితే రాష్ట్రంలోని 90 శాతం ఆసుపత్రుల్లో కార్మికులకు రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు మాత్రమే చెల్లిస్తూ వారి జీవితాలతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన నెలకు నాలుగు సెలవులను కూడా జీతాల్లో కోత విధిస్తూ కార్మికులను బెదిరిస్తున్నారని తెలిపారు.

కాంట్రాక్టర్ వ్యవస్థ నుంచి కార్మికులకు విముక్తి కల్పించి అందరినీ ఐఎఫ్ఎంఐఎస్ విధానంలో విలీనం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ డిమాండ్ చేశారు. అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కార్మికుల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన జిల్లా కమిటీ
గౌరవ అధ్యక్షుడు: గొర్రె నాగరాజు
గౌరవ సలహాదారులు: స్వరూప, ఇందిరా, రమేష్
అధ్యక్షుడు: ఎన్. విజయ్‌జీ
ఉపాధ్యక్షులు: రాజేష్, అరుణ్ కుమార్, బిక్షపతి
సహాయ కార్యదర్శులు: ఎ. లక్ష్మణ్, ఎ. ఆనందం, వి. శ్రీనివాస్, కమల
కోశాధికారులు: పవన్, రాజ, ఎ. లలిత
ప్రచార కార్యదర్శులు: లింగమూర్తి, కరుణ, ఎం. కిరణ్
ఈసీ సభ్యులు: విజయ్ నాయక్, జే. కుమార్, లత, నర్సయ్య, నాగిరెడ్డి, శ్రీనివాస్, మధు, కరుణాకర్, దయానంద్, అరుణ తదితరులు ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి అనిల్ కుమార్, వైనాల రవి, జనగామ జిల్లా అధ్యక్షుడు రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, కోశాధికారి రూతు, ఉపాధ్యక్షులు కవిత, రాజు, కరుణాకర్, లక్ష్మి, రమ తదితరులు పాల్గొన్నారు.

# విక్రాంత్ రావు మృతి పట్ల చైర్మన్ జంగా రాఘవరెడ్డి సంతాపం





**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 17**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విక్రాంత్ రావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకుని తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విక్రాంత్ రావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆత్మీయంగా ఓదార్చారు. విక్రాంత్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రపు కోటేశ్వర్, రావుల విద్యాసాగర్, గంగుల రాజిరెడ్డి, సత్యవరం మధుకర్, మైముద్, రడపాక కిషన్, చోటు, చిన్న, యాసీన్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అజంజాహి మిల్లు కార్మికుల ఆవేదన

- సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం!



**కరపత్రం ప్రతినిధి చీఫ్ బ్యూరో, మే 17**
మిల్లు భూముల్లోనే నివాస ప్లాట్లు కేటాయించాలని కార్మికుల డిమాండ్ వరంగల్ నగర పారిశ్రామిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగిన అజంజాహి మిల్లు కార్మికుల న్యాయపోరాటం కీలక దశకు చేరుకుంది. స్వచ్ఛంద పదవీ విరమణ పథకం కింద 2002లో ఉద్యోగాల నుంచి బయటకు వచ్చిన 318 మంది కార్మికులకు సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు వచ్చినప్పటికీ, అధికారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా అది అమలుకు నోచుకోవడం లేదని అజంజాహి మిల్లు 2002 ఎంవీఆర్ఎస్ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం ఆరోపించింది.

సంఘం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం, సుప్రీంకోర్టు 2021లో ఇచ్చిన తీర్పులో లక్ష్మీపురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 61, 62, 63, 64, 65, 66, 67, 68, 69, 71, 76తో పాటు ఖిలా వరంగల్ మండల పరిధిలోని 381, 386, 387 సర్వే నంబర్ల భూములను కార్మికుల నివాస ప్లాట్ల కోసం కేటాయించాలని స్పష్టంగా ఆదేశించింది.అయితే, 2023లో ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని కోర్టు సూచించిన నేపథ్యంలో అధికారులు నగరానికి అత్యంత దూరంగా, కనీస మౌలిక వసతులు లేని, నివాసయోగ్యం కాని రాళ్లు, రప్పలతో నిండిన భూమిని చూపించారని సంఘం విమర్శించింది. కోర్టు నిర్దేశించిన గడువు ముగిసినా అక్కడ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొంది.ప్రభుత్వం సూచించిన ఆ స్థలాన్ని 270 మంది కార్మికులు ఏకగ్రీవంగా తిరస్కరించినట్లు సంఘం వెల్లడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవప్రదమైన జీవనం, నివాసం ప్రతి పౌరుడి హక్కు అని గుర్తుచేసింది. ఇతర రాష్ట్రాల్లోని మిల్లు కార్మికులకు ఆయా మిల్లు భూముల్లోనే ప్లాట్లు కేటాయించినప్పుడు, వరంగల్ కార్మికుల విషయంలో ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించింది.

సుప్రీంకోర్టు పేర్కొన్న సర్వే నంబర్లలోనే తమకు ప్లాట్లు కేటాయించే వరకు పోరాటం కొనసాగుతుందని సంఘం స్పష్టం చేసింది.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**
సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న భూముల్లోనే వెంటనే ప్లాట్లు కేటాయించాలి.
వయోవృద్ధులైన కార్మికుల దశాబ్దాల నిరీక్షణకు ముగింపు పలకాలి.
కోర్టును తప్పుదోవ పట్టించే చర్యలను అధికారులు వెంటనే నిలిపివేయాలి.
తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్మిక సంఘం మీడియాను కోరింది.

# 20న మెడికల్ షాపుల బంద్ కు మద్దతు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మే 17**




ఆన్లైన్ ద్వారా మెడిసిన్ విక్రయాలను, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను వెంటనే నిలిపి వేయాలని అంబర్ పేట కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త మెడికల్ షాపుల బందు కు వారు పూర్తి మద్దతు ప్రకటించారు. బంద్ పోస్టర్ ను ఆదివారం వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... చిన్న, స్వతంత్ర కెమిస్టుల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్న ఆన్ లైన్ మెడిసిన్ ల విక్రయాలు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలన్నారు. నకిలీ, నాణ్యతలేని మందుల విక్రయలను పూర్తిగా అరికట్టాలని, ఇది ప్రజారోగ్య భద్రతకు అత్యంత అవసరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.

# పర్యావరణ పరిక్షణలో మేము సైతం..

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, మే 17**




పర్యావరణాన్ని ప్రకృతిని పరిరక్షించుకొనేందుకు మనిషి ఎంత త్వరగా మేలుకుంటే భవిష్యత్తు తరాలకు అంతగా మేలు చేసిన వారమవుతామని బిఎస్ఐటి సాఫ్ట్వేర్ సర్వీసెస్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓలు భానుచందర్ గరిగెల, శారద నేనావత్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ సహకారంతో ఆదివారం హైదరాబాద్ జలవిహార్, నెక్లెస్ రోడ్డులో జరిగిన 'గ్రీనథాన్ -2026' రన్ ఫర్ బయోడైవర్సిటీలో పాల్గొని పర్యావరణ పరిరక్షణలో మేము సైతం.. అంటూ ప్రజలకు సందేశం ఇచ్చారు. అనంతరం నారాయణగూడలో వారు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడం ఇప్పుడు అందరి ముందున్న సవాల్ అని పేర్కొన్నారు. విద్యార్థులకు, నేటి యువతకు పర్యావరణం, కాలుష్యం వంటి కీలకాంశాలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమనీ, ఈ బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని వారు కోరారు.

# ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రవేశ పరీక్ష

- విద్యార్థులకు మైనారిటీ గురుకుల కళాశాలల ప్రవేశాలపై అవగాహన



**కరపత్రం ప్రతినిధి వరంగల్, మే 17**
వరంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ కోర్సుల ప్రవేశాల కొరకు ఆదివారం మండీ బజార్‌లోని సూఫా స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు.ఈ పరీక్షకు వరంగల్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థినీ,విద్యార్థులు హాజరయ్యారు.పరీక్షా కేంద్రంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా,వారికి విద్యా అవకాశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు (బాలురు,బాలికలు) ప్రవేశాలపై మైనారిటీ గురుకులం జక్కలొడ్డి పేరెంట్స్ కౌన్సిలర్ సర్వర్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ముస్లిం మైనారిటీ కుటుంబాలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.విద్యార్థులకు కళాశాలల ప్రత్యేకతలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు వసతి,భోజనం,పాఠ్యపుస్తకాలు,యూనిఫాం,ఆధునిక బోధన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఇంటర్మీడియట్‌లో మెరుగైన విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యా అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.ముఖ్యంగా బీద ముస్లిం మైనారిటీ కుటుంబాలకు ఈ కళాశాలలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం విద్యార్థులు,తల్లిదండ్రులు 9704449236,7396939960 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం మే 18, 2026

## అధిక రక్తపోటును నివారించుకోవాలి

▪ డాక్టర్ డి .రఘురామన్



కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మే 17
అధిక రక్తపోటును నియంత్రించుకోవాలని ప్రముఖ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ డి రఘురామన్ తెలిపారు మే 17 ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం స్థానిక బోయవాడ లో కరోనా రెమెడీస్ లిమిటెడ్ అహ్మదాబాద్ వారి సౌజన్యంతో ప్రజలకు ఉచిత రక్తపోటు పరీక్షలు , ఉభయ కాయం పరీక్షలు నిర్వహించినారని తెలిపారు .మొత్తం 97 మందికి పరీక్షలు నిర్వహించగా 12 మందికి అధిక రక్తపోటు , ఏడుగురు ఉభయ కాయం సమస్యలు ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. ఈ శిబిరంలో తగు ఆరోగ్య సూచనలు అందించామని తెలిపారు

# వీణవంక మండలానికి అరుదైన గౌరవం
## అమ్మ ఫౌండేషన్ సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

కరపత్రం ప్రతినిధి వీణవంక మే 17
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అమ్మ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాలకు విశేష గుర్తింపు లభించింది. గత రెండు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సేవ, సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల ద్వారా విశేష సేవలందిస్తున్న అమ్మ ఫౌండేషన్‌ను గుర్తిస్తూ ప్రత్యేక సత్కారం నిర్వహించారు.
ఆదివారం (17-05-2026) నర్సంపేటలోని లోటస్ పబ్లిక్ స్కూల్‌లో లీడ్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించగా, ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్ మరియు సభ్యులు దరిపెల్లి మురళి (మామిడాలపల్లి)లను లీడ్ ఫౌండేషన్



నిర్వాహకులు కాసుల శోభారాణి, రవికుమార్ ఘనంగా సత్కరించి అభినందించారు.
ఈ సందర్భంగా గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, తాము చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా గుర్తించి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తమపై నమ్మకం ఉంచి ఈ గౌరవాన్ని అందించిన లీడ్ ఫౌండేషన్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల గ్రంథాలయ ఉద్యమకారుడు కందుకూరి రాము, కవి అన్వర్, ఎఫ్ఆర్వో రమేష్ నర్సంపేట, చొల్లేటి కృష్ణమాచార్యులు, అరికెపూడి రఘు, అడ్వకేట్ శశిరేఖ, బండారి రఘు, గోక వినోద్, ఆవుల అశోక్ తదితర ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు.
అమ్మ ఫౌండేషన్‌కు లభించిన ఈ గుర్తింపు వీణవంక మండల ప్రజలకు గర్వకారణంగా నిలిచిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యుడికి ఘన సన్మానం



కరపత్రం ప్రతినిధి వేములవాడ
వేములవాడ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన ఫీర్ మహ్మద్ ను న్యూ టైగర్ యూత్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం న్యూ టైగర్ యూత్ క్లబ్ స్థాపించబడిందని, అప్పటి నుంచి సభ్యులందరూ ఐక్యంగా, స్నేహబంధంతో కొనసాగుతూ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నామని పేర్కొన్నారు. ఇటీవల తమ మిత్రబృందానికి చెందిన ఫీర్ మహ్మద్ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నిక కావడం ఆనందకర విషయమని, ఈ సందర్భంగా అందరం కలిసి ఆయనను ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పులి రాంబాబు,ముప్పిడి శ్రీధర్, గుర్రం అశోక్,ముంజ ఉమేందర్,కీసరి శ్రీనివాస్, రాము, రమణ, రఘు, ప్రవీణ్, వకీల్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్సహాయ ఒంటరి మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మే 17:
రామగుండం పట్టణంలోని నిస్సహాయ ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం భరోసా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పల్లికొండ రాజేష్, భరోసా నసీమ ఆధ్వర్యంలో దాతలు మమత గుడిమల్ల ఆర్థిక సహకారంతో శ్రీవాణి శ్రీనివాస్ మొలుగురి యూఎస్ఏ ప్రోద్బలంతో ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామగుండం కృష్ణ కుమార్ చేతుల మీదుగా ఐసిడిసి పెద్దపెల్లి జిల్లా అధికారిని అలేఖ్య పటేల్, దయానంద్ గాంది పలువురు పుర ప్రముఖుల సమక్షంలో లినిస్సహాయ ఒంటరి మహిళలకు స్వయం ఉపాది నిమిత్తం కుట్టుమిషన్లు అందజేశారు. రామగుండం సిఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మా బాధ్యతలను నిర్వర్తిస్తూ సమాజంలో జరుగుతున్న నేరాలను అరికడుతూ అప్పుడప్పుడు ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం మాకు ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే ముందు మాకు తెలియజేస్తే మా వంతు



సహాయ సహకారాలు అందజేస్తామని నిస్సహాయ మహిళలను ఆదుకోవడం కోసం చేస్తున్న కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం లో నేను భాగమైనందుకు చాలా ఆనందంగా ఉందని ఈ కుట్టు మిషన్ల ద్వారా మీకు స్వయం ఉపాధి లభించాలని సమాజంలో ఎవరికైనా ఎవరి ద్వారానైనా హాని ఏర్పడితే 100కు డయాల్ చేస్తే తక్షణమే స్పందించి మీకు రక్షణ కల్పిస్తామని యువకులంతా చెడు త్రోవ పట్టకుండా సన్మార్గంలో నడవాలని పిల్లల బిహేవియర్ పట్ల పేరెంట్స్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న గుడిమళ్ల మమతని అభినందిస్తున్నానన్నారు. అనంతరం దయానంద్ గాంధీ, భరోసా ఫౌండర్ నసీమ మాట్లాడుతూ నిస్సహాయ ఒంటరి మహిళలకు స్వయం ఉపాధి కై కుట్టు మిషన్లు అందజేయడం వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందజేయడం మా కనీస బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాకు ఆర్థిక సహాయ సహకారాలు అందించిన గుడిమల్ల మమత కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శ్రీవాణి శ్రీనివాస్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బింగి రవి, పల్లికొండ రాజేందర్, పల్లికొండ సంతోష్,బింగి నరేందర్, గారె రవి, చాంద్ పాషా,ఉమర్, రఘు, మనోజ్,నిహాల్, రాకేష్, శ్రీకాంత్, పల్లికొండ మల్లయ్య కార్లతో పాటు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజన్న గోశాలకు 65 ట్రాక్టర్ల ఎండు గడ్డి విరాళం





కరపత్రం ప్రతినిధి వేములవాడ
వేములవాడ రాజన్న గోశాలకు పెద్దపెల్లి జిల్లా రైతులు 65 ట్రాక్టర్ల ఎండు గడ్డిని ఆదివారం విరాళంగా అందించారు. గత ఐదేళ్లుగా నిరంతరంగా సేవలు అందిస్తున్న జానకిరామ్ ట్రాక్టర్ ఓనర్, డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు ఈ ఏడాది భారీ స్థాయిలో గడ్డిని సమర్పించారు. రైతులకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. గో సేవ పుణ్యప్రదమని, భక్తులు గోశాలకు నేరుగా వచ్చి సహాయం చేయవచ్చని దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి తెలిపారు. ఈ ఎండు గడ్డిని రైతులు ఆలయ డీఈఓ భాస్కర శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, గోశాల పర్యవేక్షకులు విజయ్, గోశాల జూనియర్ అసిస్టెంట్ గొట్టం రవి తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా మెడికవర్ హెల్త్‌టాక్

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మే 17
హైపర్‌టెన్షన్ (బీపీ)ని అదుపులో ఉంచుకుంటే ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం ఉండదని మెడికవర్ వైద్యులు సూచించారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కరీంనగర్ వెటర్నరీ కళాశాల మైదానంలో వాకర్స్ కోసం ప్రత్యేక హెల్త్ టాక్ నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, అనెస్థీషియా నిపుణుడు డాక్టర్ వినయ్, క్రిటికల్ కేర్ వైద్యుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి పాల్గొని అధిక రక్తపోటు (బీపీ) వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడుతూ బీపీని 'సైలెంట్ కిల్లర్ గా అభివర్ణించారు. చాలా మందికి బీపీ ఉన్న విషయం తెలియకపోవడం వల్ల గుండె, మెదడు, కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని హెచ్చరించారు. రెగ్యులర్‌గా బీపీ చెక్ చేసుకోవడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి



అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రోజువారీ జీవితంలో ఫిజికల్ ఆక్టివిటీ, మంచి నిద్ర, ఇంట్లో తయారైన ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు బీపీ నియంత్రణకు దోహదపడతాయని తెలిపారు. రోజుకు ఐదు గ్రాములకంటే ఎక్కువ ఉప్పు తీసుకోవద్దని సూచించారు. ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి బీపీ పరీక్ష చేయించుకోవాలని, 140 దాటితే తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రకృతికి దగ్గరగా జీవించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా కూడా బీపీని నియంత్రించవచ్చన్నారు. కిడ్నీ సమస్యలున్న వారిలో బీపీ పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అవసరమైతే మాత్రమే మందులు వాడాలని, ప్రతి ఒక్కరూ జీవితాంతం బీపీ మందులపై ఆధారపడాల్సిన అవసరం లేదని వైద్యులు వివరించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన హె ల్త్‌టాక్‌లో 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, కాంగ్రెస్ పార్టీ టౌన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరెందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి భూంరెడ్డి, కోశాధికారి రాంనాథం, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, చంద్రశేఖర్, సంతోష్, మనోజ్, హరీష్, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ మే 17 కరపత్రం ప్రతినిధి
కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మారేడ్ పల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ యాదవ్ గారి ఆధ్వర్యంలో నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఆదివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
ఈ జాబ్ మేళాలో మహేంద్ర, విప్రో, టెలీ కాన్ఫరెన్స్, హెల్త్ కేర్, ఐటీ, బీపీఓ తదితర 50 ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు సాధించి ఆత్మవిశ్వాసంతో తమ జీవితాలను తీర్చిద్దుకోవాలని ఆకాంక్షించారు. యువత కోసం ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంతోష్ యాదవ్ గారిని ఆయన హృదయపూర్వకంగా అభినందించారు.అనంతరం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ స్వయంగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కులమత విభేదాలను తీసుకొచ్చిన గత టిఆర్ఎస్ ప్రభుత్వం అని పలు పార్టీ నాయకుల ఆరోపణలు

కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 17
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎటువంటి కులమతలను తీసుకురాని అధికారిక పాలకులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతోనే కుల మత విభేదాలను విభజించుకుంటూ పరిపాలన సాధించిన బి ఆర్ ఎస్ ప్రభుత్వం దోచుకున్నంత దోచుకొని ఎవరికి వారే యమునా తెలి అనే విధంగానే ఆ నలుగురు సంపాదించుకునే విధంగానే తెలంగాణ రాష్ట్ర ప్రజల రక్తనాళాలను రక్తాన్ని పిర్చి విప్పి చేసిన ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావాలని ఉద్యమాలను చేపట్టి వారి స్వార్థపర రాజకీయంగా వివాహించి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని దళితున్ని చేస్తాను అని చెప్పిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు తానే ముఖ్యమంత్రి పదవిని ఆశించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో రెండవసారి జరిగినటువంటి ఎన్నికల్లో కూడా మళ్లీ తానే ముఖ్యమంత్రిగా వ్యవహరించి వారికి తెలియని ఆస్తులను సంపాదించుకున్నారే తప్ప తెలంగాణ రాష్ట్ర ప్రజల వారి బాధలను ఏనాడైనా పట్టించుకున్నారని





పలు పార్టీ నాయకులు ఆరోపణలుచేస్తున్నారు నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగుతుంది అని కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి ఇష్టానుసారంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో గత ప్రభుత్వం బి ఆర్ ఎస్ పరిపాలనగానే సాగిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పరిపాలన ఎవరికోసం 99 రోజులు ప్రజా పరిపాలన ప్రజా నాయకులు ఏమి చేయలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రజలకు ఎటువంటి సమాధానాలు చెప్పుకునే పరిస్థితులు కొన్ని సందర్భాలు ఎదుర్కోవడం జరుగుతుంది ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నటువంటి నిరుపేద నిరుద్యోగులు చదువుకునేటువంటి చదువుకు ఎన్నో ఉద్యోగాలు వస్తాయి అని ఆశలను నిరాశ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన నిరుద్యోగులకు సరియైన ఉద్యోగాలను ఇవ్వలేని ప్రభుత్వాలు అని పలు నిరుద్యోగులు ఆవేదనలు వ్యక్తం చేస్తున్నారు ఇకనైనా ప్రతి ఒక్క తెలంగాణ ఏర్పాటు అయిన తర్వాత మూడవసారి జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు పొందిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు నిరుద్యోగులు వారి ఆశాభను తెలియజేస్తున్నారు ఇకనైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు నిరుద్యోగులు తెలియజేస్తున్నారు

## రెండు ఫామ్ హౌస్ లో లిక్కర్ స్వాధీనం..

హైదరాబాద్ మే17 కరపత్రం ప్రతినిధి
ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్ హౌస్ లో లిక్కర్ వినియోగిస్తున్న గ్రామంలో రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ బి టీం సుభాష్ చందర్ ఎస్సై అఖిల్ సిబ్బంది కలిసి రెండు ఫామ్ హౌస్ లపై దాడులు నిర్వహించారు. వైయస్సార్ ఫామ్ హౌస్ లో 3.75 లిక్కర్ ను, 23.37 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు.ఎం ట్రీన్ ఫామ్ హౌస్ లో 2.77 లీటర్ల లిక్కర్ ను, 9.1 లీటర్ల బీర్ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుభాష్ చంద్ర తెలిపారు.రెండు ఫామ్ హౌస్ లపై కేసు నమోదు చేసి లిక్కర్ను ఎక్సైజ్ స్టేషన్ మీర్పేట్ లో అప్పగించారు.

## బెల్లం పట్టివేత..

హైదరాబాద్ మే17 కరపత్రం ప్రతినిధి
హైదరాబాదు నుంచి అచ్చంపేటకు కారులో వెళ్తున్నటువంటి బెల్లాన్ని ఎస్టీఎఫ్ బి టీం ఎస్ఐ బాలరాజు పట్టుకున్నారు. కారులో 150 కేజీల ఆలం, 90 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆలంతోపాటు కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్టీఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు తెలిపారు.